ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికల హవా..

పార్వతీపురంటౌన్: ఈ ఏడాది మార్చినెలలో జరిగిన ఇంటర్‌మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో పార్వతీపురంలోని వాసవి కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో గెంబలి జగదీష్ 464/470 మార్కులు సాధించి పట్టణంలో అగ్రగామిగా నిలిచాడు. ప్రథమ సంవత్సరం బైపీసీ గ్రూపులో వి.మేఘన 415/440 మార్కులు సాధించింది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో కె.బిందు 981, వై.అనిత 980, కె.ప్రవల్లిక 977, కె.సాయిమణికంఠ 976, వి. రేష్మ 974 మార్కులు సాధించారు. అలాగే బైపీసీ గ్రూపులో డి. రత్న లతశ్రీ 969, జి.రోహిణి 968, వీటీఎస్ ధాత్రాజ్ 964, సీహెచ్ స్వరూప 962, జె.భాగ్యశ్రీ 958, ఆర్.మేఘన 956 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ పీవీకే మణికుమార్, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

పీఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

బలిజిపేట: ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో బలిజిపేట పీఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 95మంది విద్యార్థులు హాజరవగా 42మంది, ద్వితీయ సంవత్సరంలో 97మంది విద్యార్థులు హాజరవగా 44మంది ఉత్తీర్ణులైనట్లు కళాశాల కరస్పాండెంట్ హరిప్రసాద్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో చిన్ని అప్పలనాయుడుకు 942మార్కులు, వి.రేణుకకు 925మార్కులు వచ్చినట్లు చెప్పారు. బైపీసీలో కె.త్రివేణికి 944మార్కులు వచ్చాయన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.మాధుర్య 412మార్కులు, బైపీసీలో ఎం.సురేఖ 358మార్కులు సాధించారని చెప్పారు.


త్రివేణి

సత్తాచాటిన లావణ్యకు అభినందనలు

సీతానగరం: ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో దారపురెడ్డి లావణ్య ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 974/1000 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. లావణ్య జిల్లాలో టాపర్‌గా నిలవడం పట్ల తండ్రి త్రినాథరావు,కుటుంబీకులు అభినందించారు. లావణ్య బూర్జ ఉన్నత పాఠశాలలో పదవ తరగతివరకూ అభ్యసించింది. విశాఖలోని ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ ఇంటర్మీడియట్ విద్యనభ్యసించింది. అలాగే లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేడవరపు లహరి ఇంటర్మీడియట్ (ఎంపీసీ) ఫస్టియర్ ఫలితాల్లో 459 మార్కులు సాధించింది.

సీఈసీ టాపర్‌గా కవిత

సాలూరు: ఇంటర్మీడియట్ ఫలితాల్లో సీఈసీ జిల్లా టాపర్‌గా మండలంలోని కరాసవలస గ్రామానికి చెందిన జమ్ము కవిత నిలిచింది. దీంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, గ్రామపెద్దలు కవితను గురువారం అభినందించారు. కవిత ప్రథమ సంవత్సరంలో 466 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో 464 మార్కులతో కలిపి 930 మార్కులు సాధించింది.అలాగే మండలంలోని పురోహితునివలస ఆదర్శపాఠశాలలో ప్రథమ సంవత్సరంలో 18 శాతం, ద్వితీయ సంవత్సరంలో 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ విభాగంలో 973 మార్కులతో బంకురు హిమబిందు కళాశాల టాపర్‌గా నిలిచింది. అలాగే బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరంలో 22.33 శాతం, ద్వితీయ సంవత్సరంలో 53 శాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇంటర్‌లో 23.68 శాతం, సెకెండ్ ఇంటర్‌లో 40 శాతం ఉత్తీర్ణత సాధించారు.


సాలూరు: కవిత (సీఈసీ - 930)

మెరిసిన అమ్మాయిలు ..

మక్కువ: ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలు మెరిశారు. మండలంలోని కాశీపట్నం కేజీబీవీ పాఠశాలకు చెందిన 35 మంది ప్రథమ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయగా 28 మంది పాసయ్యారు. కె.వసంతి 404 (బైపీసీ) మార్కులతో టాపర్‌గా నిలిచింది. అలాగే సెకెండ్ ఇయర్‌లో 35 మందికి గాను 33 మంది పాసయ్యారు. రామలక్ష్మి 882 మార్కులు సాధించినట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారిణి నాగదుర్గ తెలిపారు. అలాగే మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. ప్రథమ ఇంటర్‌లో 77 మంది పరీక్షలు రాయగా.. 65 మంది పాసయ్యారు. పి.చాందిని 445 (ఎంపీసీ), బి. క్రాంతి 405 (బైపీసీ), జి. దీపిక 278 (ఎంఈసీ), ఎ. శిరీషా 301 (సీఈసీ) మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ ఇంటర్‌లో 77 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 69 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో కె. గాయత్రి 970 (ఎంపీసీ),కె. శిరీషా 962 (బైపీసీ), బి.సూర్యకళ 891 (ఎంఈసీ), టి. శ్యామల 885 (సీఈసీ) మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు.


వసంతి


రామలక్ష్మి


గాయత్రి


శిరీషా


సూర్యకళ


శ్యామల


చాందిని


కాంతి

విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా

పార్వతీపురంటౌన్: మండలంలోని రావికోన, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ మేరకు ఆయన ప్రధానోపాధ్యాయులు, వార్డెన్, వైద్య సిబ్బందితో సమీక్షించి గతంలో విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య లక్షణాలు ప్రబలాయో? సంబంధిత ఆరోగ్య వివరాలు, రికార్డులు, హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులు పరిశీలించారు. రక్తహీనత ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు ఎటువంటి చర్యలు చేపట్టారనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిశీలన చేశారు. అనారోగ్య లక్షణాలు గుర్తించిన విద్యార్థులకు వైద్య సిబ్బందితో పరీక్ష చేయించి, మందులు అందజేశారు. విద్యార్థులకు రక్త హీనత, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం ఆవశ్యకత, రోగ నిరోధక శక్తిపై అవగాహన కల్పించారు. అలాగే మలేరియా, డెంగీ తదితర జ్వరాల లక్షణాలను విద్యార్థులకు వివరించి ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వైద్య సిబ్బందితో వేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. సింగన్నదొర, సూపర్‌వైజర్ జయగౌడ్, హాస్టల్ వార్డెన్ సింహాచలం నాయుడు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు

ఘనంగా భగీరథ జయంతి

పార్వతీపురం: భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను పట్టణంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ,సాధికారత అధికారి ఎస్.కృష్ణ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగీరథుడు దీక్ష, సహనానికి ప్రతిరూపమని, ఎంత కష్టమైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించారని, దివినుంచి భువికి గంగను తీసుకువచ్చారన్నారు. అందుకే కష్టాన్ని లెక్కచేయకుండా అనుకున్నది సాధించే వారిని భగీరథునితో పోల్చుతారన్నారు. భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. కష్టపడితే తప్పకుండా ఫలితం వస్తుందన్నారు. కార్యక్రమంలో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎస్.సాంబయ్య, సూపరింటెండెంట్ సన్యాసిరావు, వార్డెన్‌లు తదితరులు పాల్గొన్నారు.


భగీరథుని చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

వలంటీర్లకు ఇంటర్వ్యూలు

సీతానగరం: వివిధ కారణాల వల్ల మండలంలోని మూడు గ్రామాల్లో ఖాళీ అయిన వలంటీర్ల నియామకానికి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్జలో 2, ఆర్ వెంకంపేట 1,పెదభోగిలి1 వంతున వలంటీర్ పోస్టులు ఖాళీ అవడంతో భర్తీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. ఈ మేరకు బూర్జనుంచి ఇద్దరు, ఆర్ వెంకంపేటకు ఒకరు. పెదభోగిలి నుంచి ఒకరు వంతున ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తుల మేరకు ఇంటర్వ్యూ నిర్వహించి, అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలించినట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడానికి ప్రభుత్వాన్ని అనుమతి కోరనున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ


ప్రత్యేక అలంకణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుంటే కోర్కెలు తీరుతాయని,సంతానం లేనివారు ప్రత్యేక పూజలు చేయడం వల్ల సంతాన ప్రాప్తి కలుగుతుందన్న నమ్మకం భక్తుల్లో ఉందన్నారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు వితరణ గావించారు.

వేతనదారులు సమయపాలన పాటించాలి


వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులు సమయ పాలన పాటించి, ఎండకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన జోగింపేటలో వేతనదారుల మస్తరును పరిశీలించి వేతనదారులు మట్టి పనులు చేసుకుని ఇంటికి చేరే విధంగా ముందు జాగ్రత్తచర్యలు చేపడుతున్నామన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు పనిచేసిన చోట నీడనిచ్చే చల్లని మంచినీరు లభ్యమయ్యేలా సత్వర చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

సర్పంచ్‌కు సన్మానం


పెదపెంకిలో సర్పంచ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామసర్పంచ్ ఎస్.పాపారావును గ్రామస్తులు బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు. పెదపెంకి ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడంపై గ్రామస్తులు సంతృప్తి వెలిబుచ్చారు. ఈ మేరకు సచివాలయం పరిధిలో గ్రామంలో అందరికి సరైన సేవలు అందుతున్నందున ప్రభుత్వం గుర్తించి పంచాయతీకి అవార్డు అందించడం సంతృప్తిగా ఉందన్నారు. సర్పంచ్ పాపారావు ఆధ్వర్యంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రశంసలు కురిపించారు. గతంలో లేనివిధంగా అభివృద్ధి కనిపిస్తోందన్నారు. పంచాయతీకి మరిన్ని అవార్డులు రావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు, జి.అప్పలనాయుడు మాస్టారు, సీహెచ్. సత్యంనాయుడు, జి.జగన్, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలే ముద్దు


అడ్మిషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పార్వతీపురం టౌన్: ప్రైవేట్ వద్దు..ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే ముద్దు అని శ్రీ వెంకటేశ్వరా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర చలపతిరావు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణం, మండలంలో అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలోని సదుపాయాలు, సౌకర్యాలు, బోధన-అభ్యసన కార్యక్రమాలపై పార్వతీపురం పట్టణం, చుట్టుపక్కల గ్రామాల్లో ఇంటర్‌మీడియట్ పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కళాశాల వివరించామన్నారు. కళాశాల ఆధునికీకరణ, డిజిటల్ బోధన మొదలైన వాటి గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని అంచనా వేయాలి

సాలూరు: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో మామిడి, జీడి, అరటి, తదితర పంటలకు తీవ్ర నష్టం చేకూరిందని, వెంటనే అధికారులు పంట నష్టాన్ని అంచనా వేయాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ, ఈదురుగాలులకు మామిడి, జీడి, అరటి పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. నష్టాన్ని మంత్రి పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం ఘనత సీఎం జగనన్నదే

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని వీరభద్రపురం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా ఆత్మీయ స్వాగతాన్ని పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, తీళ్ల సుభద్రమ్మ, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, ఎంపీటీసీలు, స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు ,కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వాహన త్రైమాసిక, లైఫ్‌టాక్స్‌లు చెల్లించాలి

పార్వతీపురంటౌన్:

వాహనాల త్రైమాసిక, లైఫ్‌టాక్స్‌లను ఏప్రిల్ 30 నాటికి చెల్లించాలని జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జున రెడ్డి అన్నారు. ఏప్రిల్ 30 నాటికి చెల్లించని వారిపై అపరాధ రుసుము విధిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. మే 1వ తేదీ నుంచి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తామని వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వాహన దారుల వద్ద విధిగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో వాహనాల ఆధారంగా 2023-24 సంవత్సరంలో ప్రభుత్వం రూ.55.27 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు చెప్పారు. అందులో త్రైమాసిక పన్ను కింద రూ.17.73 కోట్లు, లైఫ్ టాక్స్ కింద రూ.27.82 కోట్లు, ఫీజు పద్దు కింద రూ.5.45 కోట్లు, సర్వీస్ చార్జీల పద్దు కింద రూ.1.08 కోట్లు, డిటెక్షన్ పద్దు కింద రూ.3.20 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.


జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జున రెడ్డి

సచివాలయాల్లో నిరంతరం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలి

సీతానగరం:

మండలంలోని సచివాలయాల ఉద్యోగులు ప్రతి రోజూ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 వరకూ ప్రజలనుంచి సమస్యల దరఖాస్తులు స్వీకరించాలని తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ వేర్వేరు సందర్భాల్లో తెలియజేశారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలందించాలని సంకల్పించిన నేపథ్యంలో మండలంలోని 21 సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన అంశాలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్దేశించిన సమయాల్లో సచివాలయ ఉద్యోగులు విధుల్లో ఉన్నదీ లేనిదీ మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులు విధిగా నిబంధనలు పాటించాలని హితవు పలికారు.

భూముల హద్దుల్లో సర్వే రాళ్లు పదిలం

సీతానగరం: జగనన్న సమగ్ర భూసర్వే పూర్తయిన భూముల్లో ప్రభుత్వ నిధులతో వేసిన సర్వే రాళ్లను రైతులు పదిలం చేసుకున్నప్పుడే భూ వివాదాలను నిరోధించవచ్చని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు మండలంలోని నీలకంఠాపురంలో సమగ్రంగా సర్వే అధికార సిబ్బంది గుర్తించిన భూములకు సంబంధించిన సరిహద్దుల్లో గురువారం ఆయన రోవర్ విధానం ద్వారా రాళ్లను అమర్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూముల హద్దులు తెలియక తరచూ భూ వివాదాలు జరుగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర భూముల్లో రీసర్వే పనులను ప్రారంభించిందన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల రైతులకు సమగ్ర భూ హక్కు, భూ రక్ష పథకాల ద్వారా హక్కుపత్రాలను ఇప్పటికే ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే మండలంలోని 44 హ్యాబిటేషన్ గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేసి రైతులకు హక్కు పత్రాలు పంపిణీ చేయడంతో పాటు భూములకు హద్దులను గుర్తించి సర్వే రాళ్లు అమర్చనున్నట్లు తెలిపారు. సర్వే రాళ్లు వేస్తున్న సమయంలో సర్వే సిబ్బందికి రైతులు, వలంటీర్లు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకరరావు, సచివాలయ సర్వేయర్లు ఎస్ శ్రీనివాసరావు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, వలంటీర్లు అప్పలనాయుడు, గణేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పార్వతీపురంటౌన్: రబీ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఎం.డి నాయక్, డీఎస్ఓలకు వినతిపత్రం అందజేశారు. దీనికి జిల్లా మేనేజర్ స్పందించి తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రెండు లక్షల 31 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సుమారు 50 వేల మంది రైతులు నుంచి సేకరించామని, కేవలం రూ.15 లక్షలు మాత్రమే రైతులకు బకాయి ఉన్నామని, అది వారి ఖాతాల్లో ఉన్న సమస్య అని తెలిపారు. అదే సందర్భంలో ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన హమాలీ చార్జీలు, గన్నీ బ్యాగ్స్ సంబంధించి రైతులకు ఏడు కోట్ల రూపాయల వరకు చెల్లించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు చందక కేశవరావు, వి.సత్యనారాయణ, పాలవలస రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఎం.డి నాయక్‌కును కలిసిన ఏపీ రైతు సంఘం నాయకులు

పాఠశాలల పరిశీలన

బలిజిపేట: మండలంలోని చిలకపల్లి, గంగాడ గ్రామాలలో పాఠశాలలను ఎంఈఓ శ్రీనివాసరావు గురువారం పర్యవేక్షించారు. పాఠశాల రికార్డుల నిర్వహణ, విద్యార్థుల పరీక్షాపత్రాలు, నైపుణ్యాలను ఈ సందర్భంగా పరిశీలించారు. పాఠశాల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉన్నదీ లేనిది తనిఖీ చేసి తగిన సూచనలు అందించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేసి వారికి అందించాలని సూచించారు. రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను విడిచి వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. పాఠశాల నిధులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. నిధుల ఖర్చుకు సంబంధించి పక్కాగా లెక్కలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


చిలకలపల్లి ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం

సీతానగరం: మండలంలోని అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది గర్భిణులకు రోజువారీ పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని బొబ్బిలి, సీతానగరం మండలాల ఐసీడీఎస్ పీఓ సీహెచ్ అరుణకుమారి అన్నారు. ఈ మేరకు గురువారం చినభోగిలి, జోగింపేట, బూర్జ అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్లు నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి మెరుగైన సేవలందించాలని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలు, సూచనలు సలహాలు,ఆదేశాలు పాటిస్తూ విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని,వైద్యసిబ్బందితో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విధులకు సంబంధించిన రిపోర్టులు నిర్ణీత సమయానికి కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయాసెక్టార్ సూపర్‌వైజర్లు అరుణకుమారి, సుబ్బలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ సీహెచ్ అరుణకుమారి


వైఎస్సార్ బీమా పరిహారం అందజేత

మక్కువ: మండల కేంద్రానికి చెందిన ఓయల సరస్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు మంజూరైన వైఎస్సార్ బీమా పరిహారం రూ. పది వేలను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు మృతుడి కుమారుడు వరంనకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసరావు, కృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యుడికి వైఎస్సార్‌బీమా పరిహారం అందజేస్తున్న మావుడి రంగునాయుడు

పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

సీతానగరం: జగనన్న పాలనలో పార్టీ కోసం కష్టపడినవారికి ఫలితం ఉంటుందని నూతనంగా నియమితులైన తామరఖండి పీఏసీఎస్ చైర్మన్ మూడడ్ల మన్మథరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తామరఖండి పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం సేవలందించినందుకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి ఫలితంగా తనను పీఏసీఎస్ చైర్మన్ పదవిలో నియమించారన్నారు. ప్రజల సహకారంతో పీఏసీఎస్ ద్వారా రైతులకు సేవలందిస్తానని, వారికి అవసరమైన ఎరువులు, విత్తనాలు సమకూర్చడానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎస్ రామకృష్ణ, దాసరి సింహాచలం, ఏగిరెడ్డి శ్రీనివాసరావు, బల్లకృష్ణాపురం ఉపసర్పంచ్ జగన్నాథం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జి సింహాచలం , మాజీ సర్పంచ్ ఎం శంకరరావు, వెంకటనాయుడు, పీఏసీఎస్ సీఈఓ శంకరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ మన్మథరావు

గడ్డికుప్ప దగ్ధం

పాచిపెంట: మండలంలోని మోసూరులో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన ఎక్కుడు కృష్ణకు చెందిన గడ్డికుప్ప దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెదబొండపల్లి పాఠశాల తనిఖీ

- రికార్డులు పరిశీలించిన ఇన్‌చార్జ్ డీఈఓ

పార్వతీపురంటౌన్:

ప్రతి పాఠశాలలో రికార్డులు పక్కాగా ఉండాలని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన పెదబొండపలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో రికార్డులను, డైరీలు పరిశీలించామని, పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం నిబంధనలు పాటించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించరాదని హితవు పలికారు. మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జగనన్న గోరుముద్ద సక్రమంగా అమలవుతోందా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని జి గౌరి, సూర్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, సీఆర్‌పీ దీప్తి, రాణి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ వెంకటేశ్వరరావు

స్కూల్ గ్రాంట్‌లపై సామాజిక తనిఖీలో జాగ్రత్తలు

సీతానగరం: ప్రభుత్వం పాఠశాలలకు మంజూరుచేస్తున్న నిధుల వ్యయంపై హెచ్ఎంలు జాగ్రత్తలు పాటించాలని ఇన్‌చార్జ్ డీఈఓ పి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం సీతానగరం మండలవిద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ జి.సూరిదేముడు అధ్యక్షతన సామాజిక తనిఖీలపై ప్రధానోధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పద్దుల కింద మంజూరుచేస్తున్న నిధుల వ్యయంపై నివేదికలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే మన బడి నాడు నేడు నిధులతో చేపడుతున్న పనులకు చేస్తున్న ఖర్చులవివరాలు సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను పరిశీలించి పిల్లల సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ఎంఈఓ సూరిదేముడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సామాజిక తనిఖీలను రికార్డుల్లో పొందుపర్చి జాగ్రత్తలు పాటించాలనే సంకల్పంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ బి హరిత, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.